# కవిప్రవరుడు

పేరెన్నిక గన్న పెన్నానదీ తీరం!

కోకట గ్రామం!

రేనాటిలో తర్వాత్తర్వాత చాలా ప్రసిద్ధి కెక్కిన పల్లె.

ఆ వూళ్లో -

ఆహితాగ్ని అల్లసాని చొక్కయామాత్యులవారు ఋగ్వేదంతో పాటు లౌకిక విద్యలూ, శాస్త్రాలూ అభ్యసించిన మేటి. గ్రామాధికారం వంశపారంపర్యంగా సిద్ధించినా గ్రామ పెత్తనం మాత్రం నీతీ నిజాయితీతో నడవడికతో స్వయంగా వలచి వచ్చిందే!

ఆ ఇల్లు - చొక్కయామాత్యుల వారి గృహం -ఆతిధ్యాలకి చదువులకి ప్రతీక

కాశీలో. అన్నపూర్ణ సత్రానికి ప్రతీక.

నవద్వీపంలో వేదాలు చదువులకి పతాక

భూసూక్త ప్రవచనంతో తెల్లవారుతుంది అక్కడ! శ్రీ సూక్త పురుష సూక్తాలతో పొద్దెక్కుతుంది. నమక చమకాలతో పగలు వగలు పోతుంది. సాయంతనాలు సాహిత్యచింతనతో సాగితే, రేయి భాగవత ప్రవచనంతో నడికిరేయి అవుతుంది.

అది ధర్మానికి పట్టుకొమ్మ. సత్యానికి సాగురెమ్మ నియమ నిష్ఠలకు బ్రహ్మ గీసిన బొమ్మ.

ఆ ఇంట్లో-

ఆ దంపతుల నోము ఫలంగా జన్మించాడు పెద్దన. తులసి వనంలో తులసి మొక్కే మొలుస్తుంది. గంజాయి మొక్కకి తావే లేదు. ఆ కుదురున జనించిన పెద్దనకు పెద్దలు అక్షరాభ్యాసం చేశారు. అయిదో సంవత్సరానకే ఉపనీతుడ్ని చేశారు. అప్పటికే కంఠతః అమరం వచ్చేసింది. నిఘంటువుతో పాటు సాహిత్య విశేషాలూ చెప్పారు తండ్రిగారు. ఇంటి చెట్టు వైద్యానికి పనికి రాదు అన్నట్టుగానే ఇంట విద్య అంతగా పేరుకు రాదు అందుకే కొడుకును వెంట పెట్టుకుని అహోబిలం వెళ్ళారాయన.

అక్కడ మఠానికి ఏడో పీఠాధిపతి అయిన శఠగోపయతీంద్రుల శ్రీ చరణాలకు ప్రణమిల్లారు. శ్రీవారికి వీరేం కొత్తకాదు. కాశీ రామేశ్వరాలకు పోయే ఘంటా పథంలో ఉన్న

కోకట గ్రామాన్ని తరచు విజయనగర యాత్ర చేస్తూనో శ్రీ తిరుమలకు వెళ్తూనో దర్శించిందే. పినాకినీ జలం తాగిన పిల్లవాడికి గురువుల వారిని తమ శ్రీ పాదతీర్థం ధారపోయండని వేడుకున్నారు. ఐదారామడలు నడచి వచ్చి విద్యాదానం చేయమని అర్థించిన చొక్కయామాత్యుల వారి ప్రార్థనకు చిరునవ్వుతోనే ఆమోదించి చిరంజీవినిని చెంతకు తీసుకుని శిరస్సుపై చేయిడి దీవించారు శ్రీ గురువులు.

ఆ క్షణంలోనే కొడుక్కి సమస్త విద్యలూ వచ్చినంతగా సంబరపడి పోయారాయన. కొడుకుని గురుశ్రేష్టులకు అప్పగించి తిరుగు ముఖం పట్టారు.

పెద్దన గ్రంథం చేత పట్టాడు.

ఇట్టే వసంతాలు తిరిగి పోయాయి. పెద్దన కావ్యపాఠం పూర్తిచేశాడు అలంకార గ్రంథాలు ఆపోశన పట్టాడు. వ్యాకరణాది శాస్త్రాలను పుడిసిలి పట్టాడు. అదృష్టం కొద్దీ అయ్యవారి అనుగ్రహం కొద్దీ చతుర్విధ కవితలూ అబ్బాయి. విద్యాభ్యాసం పూర్తయింది. కోకటానికి వెళ్ళి రమ్మని దీవించారు గురువుగారు. విద్యానిలయుడైన యతీంద్రుల దయతో భాషాపరశేషభోగి ఐన పెద్దన అహోబిలం మఠం నుండి స్వగ్రాయం బయలు దేరాడు.

నూనూగు మీసాల నూత్నయవ్వనంలో స్వగ్రామానికి బయలు దేరిన పెద్దనకు - ఊరు చేరుకోక ముందు తిరుమల వెళ్ళి శ్రీవేంకటేశుడిని దర్శించాలనే కోరిక బయలుదేరింది. కోరికతో పాటే ఆయనా తిరుమలకు కదిలాడు.

✧ ✧ ✧

వడిగల గుర్రం వడిగా నడిచే కవ్వడి గుర్రంలా, కవిత్వంలా పెరుగెత్తుతోంది.

చంద్రగిరి పరిసరాలకు చేరుకుంది యవనాశ్వం.

కవితాశ్రీ సమకూర్చిన దివ్యతేజస్సు ముఖ మండలాన్ని సమస్త కవిలోకాన్ని పాలించేంత దర్పాన్ని ప్రతిబింబిస్తూన్నది. ఆ శీవిని,ఆ దర్పాన్ని చూసి మురిసిన ఓ రాజకిశోరం చేయెత్తి నమస్కరించి ఆగమన్నట్టు అభ్యర్థించింది.

ఆ రాజకశోరం - నరసింహరాయల వారి అంకురం. రాజతంత్రానికి, కుతంత్రానికి బలియై వెలియై మహామాత్యులసర్వశిరః ప్రధానతిమ్మరుసయ్య దయకు పాత్రమై బట్టకట్టి చంద్రగిరిలో తలదాచుకుంటున్న శ్రీ కృష్ణదేవరాయలు - అహఁ అప్పటికింకా 'దేవరాయ' వాచికం లేదుః- శ్రీకృష్ణరాయలే!

సమస్త కుంతలాన్నే కాదు. సమస్త దక్షిణదేశాన్ని ఘడేరావ్ అని శాసించగల దర్పం, దక్షత కనిపిస్తోన్న ఆ బాలరాయల్ని చూసి, క్షణం పరిశీలించి, జననాంతర సౌహృద లక్షణంతో భావి భాగ్యోదయ సూచక ప్రేరణతో అశ్వావరోహణం చేశారు. పెద్దన. శ్రీరస్తని పద్యంతో దీవించారు. పరిచయం నామ మాత్రంగా చెప్పుకున్నారు రాయలు. గోత్రాది కంతో ప్రవర చెప్పుకున్నాడు గుణప్రవరుడు కులప్రవరుడు అయిన పెద్దన.

కవిగారితో పాటు దైవదర్శనానికి కదిలాడు రాయలు. జోడు గుర్రాలు ఆశు కవిత్వంలా కదిలాయి. స్నేహం బంధ కవిత్వంలా ముడి పడింది. ఆత్మీయత మధురకవితలా వుంది.

స్వామి వారి సందర్శనానంతరం-

ఆలయం ముఖద్వారం వద్ద నిలిచి గోపుర శ్రీకళలను పరికిస్తూ అన్నాడు పెద్దన చిన్నగా.

"కరుణాకర వేంకట విభుచరణ స్మరణ ప్రసంగ సంగత మతీ! ఈశ్వర నరసింహ మహీభృద్వర నందన కృష్ణరాయా! తమ అంకితంగా ఒక గొప్పగ్రంథం రచిస్తాను. ఆచంద్ర తారార్కం అల్లసాని పెద్దన పేరూ ప్రఖ్యాతీ నిలుపుతుంది. రాయా! నేను కవిరాయడ్ని! ఆ స్వామి కోనేటి రాయుడు! నువ్వు -

" తుళువ రాయలవి! ఈ 'తిరుమల' రాయడి దయాప్రసాదంగా నువ్వు వజ్ర సింహాసనాభిషిక్తుడివి అవుతావు. ఇది నా వాక్కుకాదు. ఈ శ్రీనివాసుడు నా హృదయంలో ప్రవేశించి పలికిస్తున్న పలుకులు.

ఆ మాటలు విన్న కృష్ణరాయలు అటు తిరుమల రాయడికి ఇటు కవిరాయడికి అంజలించి అన్నాడు. "కవిప్రభూ! నేను వజ్ర సంహాసనాన్ని అధిష్ఠిస్తే నువ్వునా అంతరంగిక మంత్రివి. అమాత్య బిరుదంతో అందలం ఎక్కించి, ఛత్ర చామరాది, గౌరవం కలిపించి, నాటి పినవీరభద్ర కవికన్న మిన్నగా గౌరవించి, ఆస్థానకవి ముఖ్యుడిని చేసుకుంటాను. సరస్వతీ స్వరూపులైన మీరు ఈ మధుర యామినీ వేళలో పలికిన పలుకులకు ఈ గుడిగంటలే సాక్షి! మన మనస్సులే సాక్షి!"

"శ్రీ వేంకటేశ పద పద్మావేశిత సదయ హృదయా! రాయా!"అంటూ పెద్దన తనకన్నా వయస్సున చిన్న అయిన బాలరాయల్ని గుండెకు హత్తుకున్నాడు.

ఆ మధుర సన్నివేశానికి - విమానం పై వెలసిన శ్రీవేంకటేశ్వరుడు - మురిసి, పరవశించి తెలుగు దేశానికి తెలుగు తేజానికి, తెలుగు కవిత్వానికి స్వర్ణయుగం రాబోతోందని తెలిసి - నవ్వినాడా అన్నట్టు పైనున్న తార కలువిరిశాయి గుడినున్న గంటలు గణగణ మోగాయి.

✧ ✧ ✧

కోకట గ్రామానికి విచ్చేసిన పెద్దనకు అపూర్వాదరణే లభ్యమైంది. చొక్కనగారి కుమారుడిగా శఠగోపయతీంద్రుల శిష్యుడిగానే కాక కవిగా గుర్తింపు వచ్చింది. ఆశువుగా పద్యాలల్లడం, ధారాపాతంలా పద్యాలు కురిపించడం ఆ మండలంలో ఎనలేని కీర్తిని ప్రతిష్ఠని సంపాదించాయి.

ఆ నోటా ఆ నోటా పెద్దన పేరు పెద్దగా విని చొక్కయ్యగారితో వియ్యమందాలని వచ్చారు సిద్దయ్య. భారద్వాజన గోత్రానికి వసిష్ఠస గోత్రానికి వరస కుదిరింది. పెద్దన మేనమామల, గోత్రం అదే! చొక్కయామాత్యుడు నందవరీక వంశమణి. తమనాడులో దాన [illegible] యజ్ఞయాగాదులకు వేళ్ళుమడిచి లెక్కించదగిన వారు మొదటి వరుసలోనే

నిలుస్తారు. గోత్ర సూత్రాలు సరిపోవడంతో మరింకేం అనకుండా వారి నాడులో చేరెన్నిక గన్న సిద్దయగారి సంబంధానికి సంబరంగా సరే అన్నారు.

సరే అనడంతో పెద్దనగారి పెండ్లి అంగ రంగ వైభవంగా జరిగింది.

కాపురానికొచ్చింది సోమిదమ్మ.

పరోక్షంగా పెద్దనకి పెత్తనం అంటగట్టారు చొక్కయ. శిష్యులకు పాఠాలు చెబ్తూ అతిధి అభ్యాగతులను సత్కరిస్తూ, కవి పండిత గాయకులతో కాలక్షేపం చేస్తూ, గృహస్థజీవితం సాగిస్తున్నాడు పెద్దన.

విజయనగరంలో రాజకీయాలు రంగుమారు తున్నాయి.

సంసార జీవితం గడుపుతూనే హరికథా సారం పూర్తి చేసి గురువులు శ్రీ శఠగోపయతికి అర్పించాడుపెద్దన. దేనికీ లోటులేని ఆయన మనస్సులో ఒకటే లోటు తీర్ధ యాత్రలు చేయాలని! కానీ ఇల్లు విడిచి వెళ్ళే వెసులు బాటు లేదు.

తిరుమల వెళ్ళి శ్రీ వేంకటేశ్వరుడిని దర్శించాలని వున్నా - పనిలో పనిగా చంద్రగిరి వెళ్ళి రాయలని కలుసుకుందామన్నా కుదరడం లేదు. తీరికే లేని కావ్య సంసారంతో, సంసారంలో కాలం గడిచి కాల చక్రంలో ఐదు పూలు పూశాయి.

✧ ✧ ✧

ఒక రోజు

పెద్దన తమ పొలం చూసి రావాలని బయలుదేరాడు. ఒక్కడే చేతిలో మార్కండేయ పురాణం సంస్కృత ప్రతిని చేత పట్టుకుని కదిలాడు. అప్పటికే మారన తెనిగించిన మార్కండేయ పురాణం ఆయన భాండాగారం చేరి హృదయ భాండంలో నిలిచింది ఏకపత్నీ వ్రతాన్ని ప్రభోదించే ఆ పురాణం అంటే ఆయనకి ఎంతో యిష్టం.

పొలం చేరుకుని నాలుగు మూలలా తిరిగిచూసుకుని, వ్యవసాయం చక్కగా సాగిందనుకుని, ఫలసాయం బాగా వస్తుందని సంతసపడి, ఓ చోట కూర్చుని తీరిగ్గా మార్కాండేయ పురాణం తాటాకుప్రతిని విప్పి చదవ సాగాడు. స్వారోచిష మనుసంభం మనస్సుని ఆహ్లాద సీమ అంచులోకి తీసుక పోతున్నది.

✧ ✧ ✧

బాటకు ఆనుకుని వున్న చేను అది. చంద్రగిరి నుంచి విజయనగరం చేర్చే పలుమార్గాల్లో ఆ బాటా ఒక బాట! ఆ బాట వెంట ఓ పల్లకీ వస్తోంది. దానికి ముందూ వెనకా అంగరక్షులు గుర్రాలెక్కి వస్తున్నారు. పల్లకీ వెంట ఓ ఎడ్లబండీ వస్తోంది.

పెద్దనను చూసి గుర్రం దిగి నమస్కరించి ఆపై నెమ్మదిగా కదిలాడు. ఆ కొద్ది క్షణాల్లోనే పల్లకీ ఎందుకాగిందా అనే సందేహంతో పల్లకీ తెర తొలిగించి చూసింది అందులో కూర్చున్న యువతి! ఆమె ఆయన్ని చూసింది. కానీ పెద్దన ఆమెని చూడలేదు.

పల్లకీ యధారీతిగా ముందుకు సాగుతున్నా ఆ యువతి మనస్సు మాత్రం ఆ చోటు విడిచి రానన్నట్లు అక్కడికే పరుగులు తీస్తోంది. ఆ రూపం మనో యవనిక మీద

పంచరంగుల్లో ముద్రితమైపోయి వీడిపోనంటున్నది. పల్లకీలో విశ్రాంతిగ పయనిస్తున్నా మనస్సుకి శాంతి లేదు. కొద్ది దూరం నాలుగైదు చేల ప్రమాణం ప్రయాణం! పోగానే ఆగమని ఆజ్ఞాపించింది. పల్లకీ ఆగింది. అంగరక్షకులు ఆగారు - బండి ఆగింది.ఆమె పల్లకీ దిగింది.

"మన మజిలీ ఇంకెంత దూరం"'

"అల్లదే కోకట గ్రామం. శ్రీ శఠగోపయతి శిష్యులు - చొక్కయా మాత్య తనయులు - పెద్దన కవీంద్రులు వారి గ్రామం దాన్ని దాటి మరింత ముందుకు వెళితే గండికోట. అక్కడే ప్రభు సన్నిధిని మన రాత్రి మజిలీ"

"పొద్దు పోకముందే చేర్తాం కదా!"

"ఆఁ దీపాలు పెట్టే వేళకు చేరుకోగలం"

"ఇక్కడ కొద్ది సేపు విశ్రమిస్తాను. పల్లకీ వదిలి మీరంతా వెళ్లండి. ఈ పల్లెల్లో నా భద్రతకేం భయం లేదు. కూత వేటు దూరంలో వుండండి పిలవగానే రండి బయల్దేరి వెళ్దాం.

"చిత్తం"

✧ ✧ ✧

చిత్తజుడు తొందరించే తన చిత్త విభ్రమాన్ని నిగ్రహించుకుంటూ అనుచరగణం వెళ్లగానే - వెనుదిరిగింది రాజహంస.

✧ ✧ ✧

" కవిరాజహంసకు రాజహంస సవినయ నమస్కారాలు. నా పేరు రాజహంస! చంద్రగిరి మాది! మాది నర్తన వర్తనగా గల కుటుంబం! విజయగరం వెళ్తున్నాను. ప్రసిద్ధికెందిన మణి కర్ణిక,కుల భూషణి, కల భాషిణి, మంజుల, హేమాంగి నా చెలిమికత్తెలు. కాలి అందె కదిలితే శుకుడి మనస్సైనా కదిలించగల నేర్పరులం.కలకంఠ మెత్తి గానం చేస్తే విశ్వామిత్రుడినైనా లోబరుచుకోగల కంఠబలం మాది. నవయవ్వన విలాస శ్రీ వరించిన విరించీ- మీరిచ్చట ఏకాంతంలో ఏకాంతాతోడూ లేకుండా గ్రంథసాంగత్యంతో మిగిలివుంటే ఆగాను!"

"స్వస్తి" ఆశీర్వదించాడు పెద్దన. దృష్టి గ్రంథం మీది నుంచి గంధ గజేంద్రగామిని పైకి మరలింది.

"కవిరాజా! రాజాశ్రయం ఆపేక్షించక ఉపేక్ష చేస్తున్నారేం? మీ హరికథాసారం సారంగల కథా ఖండం అనిపించుకుంది. మరి ఆపై గంటము సాగడం లేదా?"

"కవిత్వమంటే మాటలా?

"మేటి మాటల వరాల మూట కదా కవివరా!

"వాక్యం రసాత్మకం కావ్యం. నీ మాట తీరు కవనవనచారిణి వనిపిస్తోంది సుమా?"

"ఇంగువ కట్టిన గుడ్డని కవి ప్రభూ! అయినా మరో గ్రంథం మాటడిగితే మాటయే మార్చి యేమార్చుతారా! భళా!"

"ఊహూఁ నిరుపహతి స్థలం, రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చే కప్పుర విడెంబం పైన

భోజనం, ఊయల మంచం, ఒప్పొతప్పో చూడగల రసజ్ఞులు, ఊహ తెలుసుకోగల లేఖకులు, పాఠకులు దొరికితే కవిత్వం దొర్లుతుంది కానీ ఊరికే కవిత్వం రమ్మంటే వస్తుందా? అలా రావడానికి - రా అంటే రావటానికి - కవితాకన్య మనింటి ఆడపడుచా? కట్టుకున్న ఇల్లాలా?"

కవిగారి చమత్కారానికి ముగ్ధురాలైంది రాజహంస.

"మేలు భళా. అనదగ్గ మేలి మాట పలికారు. ఈ కులుకులాడి మాట విని రాజసభకు రండి. పలుకులాడితో సదనర్తనం చేయించండి. ఊఁ! చేయందివ్వండి నాతో పాటు విజయ నగరం విద్యానగరం వెళదాం రండి!"

"పిలువని పేరంటానికి?" అనుకున్నాడు. ఐనా అప్పుడో యిప్పుడో అప్పాజీ నా ఆశీస్సులతో శ్రీకృష్ణరాయలు పట్టాభిషిక్తుడు కానుండగా అస్తమించనున్న ఈ వీరనర సింహరాయల ఆస్థానంలో అడుగిడ గడగడ మెందుకు?' అనుకున్నాడు మళ్లీ. క్షణం ఆగి "చాలు! నీ ఆహ్వానమే చాలు! నీతో వస్తే ఒకటి! రాకుండిన ఒకటా? ఆస్థానానికి వచ్చినట్టే అనుకో!"

"అనుకుంటేనే తృప్తి అవుతుందా! తమరు విచ్చేసి సభ నలంకరించి - ఆపై మమ్మనుగ్రహించి - మా గృహంలో విందూ, పొందూ; ఆరగించి, అనుభవించిన కదా మా జన్మ ధన్యం!"

కటువుగా వినిపించాయి ఆ మాటలు "రాజహంసా! కావ్యపతనా తపస్సులో ఉన్న మమ్మల్ని పలుకరించి మా ధ్యాన భంగం చేశావు"

మీ ధ్యాస మా దిశకు మరలించుకోవాలనే ఆశ"

"అది దురాశ! సోమదమ్మ మనోమందిరంలో ప్రతిష్ఠింపబడిన విగ్రహం మా నిగ్రహానికి మరో రూపం!"

"మారు రూపులైన తమరితో మాటేవిందు తమరితో మా పొందు - మాతో తమరి పొందు బ్రహ్మానంద సబ్రహ్మచారి విప్రవరా! నా ఆహ్వానం కాదనకండి! కాదంటే యిక్కడే యీ చేనే పూ పొదరిల్లు అవుతుంది."

"హా! శ్రీహరీ! ఏమి మాటలవి?"

"మనసులోని మాట! మర్మం విడిచిన మాట! వేయెందుకు? ధరణీ సురనందనా! ఇంద్రుడు, చంద్రుడు, కంతుడు, జయంతుడు అని పురాణాల్లో విన్నాం ఎందరో రాజేంద్రులను, కవిచంద్రులను, యువరాజ చంద్రులను వసంతులను, జయంతులను చూశాను. కానీ నిజం విను, నీ అందం, నీ చందం ముందు వారంతా దిగదుడుపే!"

పక పక నవ్వాడు పెద్దన

"వ్రతం నోమే వేళ ప్రతి వ్రతానికీ అదే వ్రతాల్లో కెల్లా ఉత్తమ వ్రతమని చెబ్తారు ఆచార్యులు. చెంత చేరిని ప్రతి మగవాడినీ - వాడే నలుడనీ, పురూరవుడనీ పొగడతారు వారకాంతలు. కులక్రమాగతంగా నువ్వూ....

"కవిరాజా! నేను వారస్త్రీని కాను. వరస్త్రీని. నన్నూ నలుగురిలో ఒకరిగా ఎంచకు! రా! రాజధానికి రా! లేదా రసరాజధానిగా నీ పొలమే...."

"చాలు! చాలు! బంగారం పండే ఈ వేలో......"

"నా వలపూ పండించు విప్రవరా!

"గణికకు వలపూ, గణకుడికి దయా ఎక్కడివి? ఇక చాలించి నీ దారిని నీవువెళ్లు. నేను యింటికి వెళ్లాలి. సాయం సంధ్యకు వేళైంది. రాత్రి కెవరైనా అతిథుల వచ్చారేమో! వారి విషయం చూసుకోవాలి!" పోబోతున్న సూచనతో కదలబోయాడు.

నిలువునా పోతబోసిన బంగారు బొమ్మలా- నీర్కావిపంచెతో, పైని పట్టుత్తరీయంతో, నుదుట సిందూర తిలకంతో, విభూతి రేఖలతో, విశాలమైన కళ్లతో, తెగబారెడు జుట్టుతో అందమంతా పోత పోసినట్టున్న ఆ బ్రాహ్మణ ప్రవరుడిన చూసి - మనసాపుకోలేక చప్పున పైబడి కౌగిలించుకుంది రాజహంస.

"ఛీ! ఛీ! ఏమిటీ తొందరపాటు! శ్రీహరీ"' అని విదిలించి ఆమెను ఒక్క తోపుతోశాడు.

అతను నెట్టి వేయగానే - తూలిసోలి- అంతలో నిగ్రహించుకుని నిలబడి బుస్సున కస్సుమని కాటువేసే నాగినిలా రుసరుస చూసింది.

విప్రవరుడైన పెద్దన నిశ్చలన చిత్రంలా నిశ్చల చిత్తంలో నిలబడ్డాడు.

"హుం యజ్ఞయాగాలు చేశావు. కావ్యపురాణాలు చదువుకున్నావు. కవి ప్రవరుడివి. ఎందుకు? తగిలెయ్యనా! కోరి వచ్చిన కోమలి అంతరంగం తెలుసుకోలేని వ్యర్థుడిని. యాచించిన వారికి తిరస్కృతే తప్ప పురస్కారం లభించదనే సామెత ఋజువు చేశావు......."

"రాజహంసా! మందార మకరంద మాధుర్యమున తేలు మధుపంబు వోవునే మదనములకు అన్నాడు సహజ పండితుడు నిర్మల మందాకినీ వీచికల దూగు రాయంచ చనునె తరంగిణులకు అనీ అన్నాడు ఆ పోతనా మాత్యుడు..........కానీ రాజహంస రాజశ్రేష్ఠులకే తగును కానీ కవిరాజులమైనా మాకు వరనీయ కాదు. వర్ణనీయ సౌందర్యారాశీ! నిన్నూ, నీ అభిలాషనూ మరువను. మరువ లేను. ఒకటి గుర్తుంచుకో! నేను ఏక పత్నీవ్రతుడ్ని! నా కిష్టమైన గ్రంథం మార్కండేయ పురాణం అందులో చాలా ప్రీతి పాత్రమైంది ఏకపత్నీ వ్రతాన్ని చాటే స్వారోచిష వృత్తాంతం మహా కవి మారనగారి కావ్యం చదువుకో జీవితాన్ని దిద్దుకో"

భుజం మీదున్న ఉత్తరీయంతో ఒళ్లు దులుపుకుని చక చకా నడిచి వెళ్ళాడు పెద్దన.

నిశ్చేష్టురాలై నిలబడి పోయింది రెప్పపాటు నిలిచిన చిన్నది. వలచి వలపించుకో లేక పోయిన చిన్నది - రాజహంస.

● రచన సచిత్ర మాస పత్రిక ఆగష్టు 92 ●